క్లుప్తంగా

ఎంపీడీవోను కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు



విశ్వేశ్వరరావుకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న నాయకులు

కవిటి: కవిటి మండలపరిషత్ అభివృద్ధి అధికారిగా నియమితులైన వి.విశ్వేశ్వరరావును వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందించారు. ఈయన లావేరు మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చిన ఆయన బాధ్యతలు స్వీకరించారు. అందరి సహకారంతో మండలాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఎంపీడీవోను కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్, బొరివంక సర్పంచ్ శ్రీరాంప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు పిరియా కృష్ణారావు, మాజీ ఎంపీపీ పీఎం తిలక్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

దూగానపుట్టుగ పంచాయతీ కార్యదర్శిగా హరీష్



కవిటి: దూగానపుట్టుగ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా గన్ని హరీష్‌ను నియమిస్తూ జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ మేరకు మంగళవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో రిపోర్టు చేశారు. హరీష్ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామసచివాలయాల్లో కవిటి-1లో డిజిటల్ అసిస్టెంట్‌గా నియమితులయ్యారు. ప్రస్తుతం గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శిగా హరీష్‌ను నియమించినట్టు మండల పరిషత్ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించండి



భవిత కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈవోలు

కంచిలి: ప్రత్యేక అవసరాల పిల్లలను అన్ని చోట్ల సర్వే చేసి గుర్తించాలని మండల విద్యాశాఖాధికారులు ఎస్.శివరాంప్రసాద్, కె.చిట్టిబాబు అన్నారు. మండల కేంద్రంలోని భవిత కార్యాలయంలో ఇద్దరు ఐఈఆర్‌పీలకు క్లస్టర్లను విభజించి, సర్వే చేపట్టే బాధ్యతలు అప్పగించారు. జూన్ తొమ్మిదో తేదీ వరకు మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను, సచివాలయాల పరిధిలో 0–18 ఏళ్ల మధ్య వయస్సుల వివరాలు అన్ని విద్యాసంస్థల్లో సేకరించాలని సూచించారు. ఐఈఆర్‌పీలు చంద్రశేఖర్, నవీన, సీఆర్పీలు పాల్గొన్నారు.

పిల్లలకు పుస్తకాలు పంపిణీ



చిన్నారులకు పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు రూరల్: విద్యార్థులు ఇంగ్లిష్ భాషపై అసక్తి చూపి నైపుణ్యాన్ని అలవర్చుకోవాలని పలువురు వక్తలు అన్నారు. చిన్నారులలో విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు బాతుపురంలో యూనిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా చిన్నారులకు ఇరోతు త్రినాథ్ ఆర్థిక సాయంతో పిల్లలకు పలు పుస్తకాలను మంగళవారం అందజేశారు. చిన్నారుల విద్యాభివృద్ధికి తనవంతుగా సాయం చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వాసుదేవరావు, పాఠశాల కమిటీ చైర్మన్, యూనిటీ ఫౌండేషన్ ప్రతినిధులు ఉన్నారు.

తీరని వేదన!

- అధ్వానంగా రోడ్లు
- అవస్థలు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని పాలకులు



బెండి గేట్ వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు



తాళబద్ర వద్ద గుంతులతో దర్శనమిస్తున్న రోడ్డు

వజ్రపుకొత్తూరు రూరల్: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సుమారు ఏడాది అవుతుంది. ఎన్నికల సమయంలో డబుల్ ఇంజన్ స్పీడ్‌తో అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చిన నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత దాన్ని మరిచిపోయారు. సంక్షేమ పథకాల అమలను పక్కన పెడితే కనీసం రోడ్ల అభివృద్ధిపై కూడా దృష్టిసారించలేదు. దీంతో శిథిలమైన రోడ్లపై ప్రజలు నరక వేదన పడుతున్నారు. రోడ్ల అభివృద్ధిపై కనీసం కన్నెత్తి చూడటం లేదని విమర్శిస్తున్నారు. వజ్రపుకొత్తూరు మండలంలో ప్రధాన రోడ్డైన బెండి గేట్–వజ్రపుకొత్తూరు, కాశీబుగ్గ నుంచి అక్కుపల్లి మీదగా వజ్రపుకొత్తూరు వరకు డబుల్ రోడ్డులు పరిస్థితి అధ్వానంగా ఉన్నాయి. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సుమారు రూ. 45 కోట్లు వ్యయంతో ఈ రెండు రోడ్లు మంజూరయ్యాయి. టెక్కలిపట్నం నుంచి నువ్వలరేవు వరకు డబుల్ రోడ్డు పనులు సుమారు 40 శాతం వరకు, వజ్రపుకొత్తూరు నుంచి అక్కుపల్లి మీదగా కాశీబుగ్గ వరకు సుమారు 60 శాతం పనులు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే పనులు జరుగుతున్న సమయంలో ఎన్నికలు రావడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రోడ్ల అభివృద్ధిని పట్టించుకోకపోవడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఇప్పుడు చిన్నపాటి వర్షం కురిసిన నీరు గుంతల్లో చేరి చెరువులను తలపిస్తున్నాయి. గుంతలు దగ్గర దగ్గరగా ఉండటంతో వాహనదారులు, పాదచారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అధ్వానంగా ఉన్న రోడ్ల పై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. నగరంపల్లి నుంచి పెదబాడాం వరకు రోడ్డు కూడా అధ్వానంగా మారింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్లను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.



వర్షపు నీరుతో చెరువును తలపిస్తున్న బెండి రోడ్డు



పాతపట్నం అమ్మవారి గుడి దగ్గర రోడ్డు దుస్థితి



శిథిలమైన అక్కుపల్లి రోడ్డు

సక్రమంగా మంచినీటి సరఫరా



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ రామారావు

కాశీబుగ్గ: ఉద్దానం ప్రాజెక్టు నుంచి పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీకీ ఇటీవల ప్రభుత్వం కేటాయించిన ఐదు ఎంఎల్‌డీ మంచినీటిని జంట పట్టణాలలో అన్ని వార్డులు, అన్ని వీధులకు సక్రమంగా సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని కమిషనర్ నడిపేన రామారావు అన్నారు. కాశీబుగ్గలో అన్ని సచివాలయాల ఏమినిటీ కార్యదర్శులు, ప్లానింగ్ కార్యదర్శులతోను మంగళవారం సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్యే గౌతు శిరీష, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు ఆదేశాల మేరకు అన్ని వార్డులకు పైపులైన్లను, ఇంటింటికీ కుళాయిలను ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. దీని కోసం సర్వే చేస్తున్నట్టు వెల్లడించారు.

అంబరాన్నంటిన సంబరం



ప్రగడపుట్టుగలో చింతామణి అమ్మవారి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

కవిటి: ఉద్దానం ప్రజల ఆరాధ్యదైవం చింతామణి అమ్మవారికి వివిధ గ్రామాలకు చెందిన భక్తులు మంగళవారం చల్లదనం ఉత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల నుంచి అమ్మవారి ప్రతిరూపంగా భావించే గజముద్దలు మేళతాళాలతో కాళికా వేషధారణలతో కవిటి పట్టణవీధుల్లో ఊరేగించారు. ఉత్సవానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన వీధినాటకాలు చూపరులను అలరించాయి.

బస్టాండ్ స్థల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్...



బస్టాండ్ స్థలానికి కొలతలు వేస్తున్న రెవెన్యూ, ఆర్టీసీ సిబ్బంది

కవిటి: కవిటిలోని ఆర్టీసీ బస్టాండ్ నిరుపయోగంగా మారింది. విలువైన స్థలం ఆక్రమణకు గురవుతుంది. దీనిపై 'నిరుపయోగంగా బస్టాండ్'శీర్షికతో ఈ నెల 11వ తేదీన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించి చర్యలకు సిద్ధమయ్యారు. బస్టాండ్ స్థలాన్ని ఆర్టీసీ, రెవెన్యూ అధికారులు మంగళవారం పరిశీలించారు. వాస్తవానికి ఆర్టీసీకి కవిటిలో 50 సెంట్ల స్థలం ఉండాలి. కానీ ప్రస్తుతం ఆక్రమణలో కొంతస్థలం పోయిందనే విషయాన్ని ప్రాథమికంగా అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులతో కలిసి కొలతలు వేయించారు. ఈ కొలతలతో ప్రైవేట్ ఆక్రమణదారులతో పాటు ప్రభుత్వశాఖల వారు కూడా ఆక్రమించారని ఆర్టీసీ అధికారులు గుర్తించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ సంతోష్ మాట్లాడుతూ.. బస్టాండ్ వినియోగానికి అవసరమైన చర్యలు తీసుకుని ఇక్కడే ప్రయాణికులకు సేవలందించే విధంగా త్వరలోనే చర్యలు ప్రారంభిస్తామన్నారు. తనిఖీల్లో ఆర్టీసీ ఇంజినీరింగ్ విభాగం డీఈఈ బి.రవికుమార్, మండల సర్వేయర్ మల్లికార్జున పాణిగ్రాహి, వీఆర్వో ఎస్.నారాయణ ఉన్నారు.

ఉపాధి లక్ష్యాన్ని పూర్తి చేయాలి

- పీడీ సుధాకర్



పశువుల షెడ్డును పరిశీలిస్తున్న పీడీ సుధాకర్

టెక్కలి:

ఉపాధిహామీ పథకం ద్వారా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను కచ్చితంగా పూర్తి చేయాలని.. ఈ విషయంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని డ్వామా పీడీ వి.సుధాకర్ హెచ్చరించారు. కోటబొమ్మాళి మండలం కిష్టుపురం పంచాయతీలో ఉపాధిహామీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లు, పశువుల షెడ్లు, తోటలో ఫారం పాండ్స్ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ కుటుంబానికి 100 రోజులు పనులు కల్పించాలన్నారు. ఉపాధి నిధులతో చేపడుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం, అలసత్వం వహించే క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులపై శాఖాపరమైన చర్యలు ఉంటాయన్నారు. ఉపాధి హామీ ఏపీవో జి.హరిప్రసాద్, ఈసీ టి.రాంబాబు, టీఏ కుమారస్వామి, వేతనదారులు పాల్గొన్నారు.

భూమిని ఆక్రమించారని ఫిర్యాదు

సంతబొమ్మాళి: కాపుగోదాయవలస గ్రామంలో సర్వే నంబర్ 207-7లో 22 సెంట్లు తన భూమిని ఇప్పించాలని రైతు సైన ఆదినారాయణ అధికారులను వేడుకున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. వారసత్వంగా సంక్రమించిన ఆస్తిని గ్రామానికి చెందిన బన్నాడ వీరస్వామి, సింహాచలం, వరహాలు, అంగ శంకరరావు, అంగ రాజారావు ఆక్రమించుకున్నారని వినతిలో పేర్కొన్నారు. కోర్టు తనకు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో తన భూమిని తన ఆధీనంలోకి తెచ్చుకోవడానికి ప్రయత్నించగా ఆక్రమించుకున్న వ్యక్తులు దౌర్జన్యంగా తనపై దాడిచేసి, భూమి మీదకు వస్తే చంపేస్తా అంటూ బెదిరిస్తున్నారని ఆదినారాయణ వాపోయారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు, ఎస్పీకి ఫిర్యాదు చేసినట్టు చెప్పారు.

గాయపడిన వ్యక్తి మృతి

టెక్కలి: కోటబొమ్మాళి మండలం హరిశ్చంద్రపురం సమీపంలో జాతీయ రహదారిపై ఈనెల పదో తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ సత్యన్నారాయణ మంగళవారం తెలిపారు. ద్విచక్ర వాహనం అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన సంఘటనలో యలమంచిలి గ్రామానికి చెందిన కవిటి ఆనందరావు (54) తీవ్రంగా గాయపడి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు చెప్పారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

కంచిలి: మకరాంపురం గ్రామంలో ప్రారంభించిన అంతర్ రాష్ట్ర క్రికెట్ పోటీల్లో భాగంగా మంగళవారం మొదటి మ్యాచ్ సాలినపుట్టుగ–కత్తివరం జట్ల మధ్య జరిగింది. ఇందులో కత్తివరం జట్టు గెలుపొందింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా కత్తివరం జట్టుకు చెందిన సాయి ఎంపిక య్యాడు. ఈయన నాలుగు వికెట్లు తీశాడు.

దళిత మహిళ డాక్టర్‌కు న్యాయం చేయాలి

టెక్కలి: పాతపట్నం మండలం బైదలాపురం పీహెచ్‌సీ వైద్యురాలు, దళిత మహిళ సత్యవాణిపై రిటైర్డ్ మెడికల్ అధికారి గణపతి సదాశివ చేసిన వేధింపులపై ఇప్పటి వరకు అధికారులు చర్యలు తీసుకోకపోవడం అన్యాయమని దళిత సంఘాల జేఏసీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం టెక్కలిలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వైద్యురాలిపై మానసికంగా వేధింపులకు పాల్పడిన వ్యక్తిని ఇప్పటి వరకు అరెస్టు చేయకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. అయితే ఈ సంఘటనపై ఈ నెల 21న పాతపట్నంలో నిర్వహించతలపెట్టిన ప్రతిఘటన ర్యాలీని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు వెల్లడించారు. పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి వేధింపులకు పాల్పడిన వ్యక్తిని తక్షణమే అరెస్టు చేయాలని జేఏసీ నాయకులు వై.గోపి, బి.ప్రభాకర్, చల్లా రామారావు, మిస్కా కృష్ణయ్య, గణేష్, దమయంతి, శ్రీనివాసరావు కోరారు.

కంచమ్మతల్లికి చల్లదనం



మండల కేంద్రం కంచిలిలో వెలసిన గ్రామదేవత కంచమ్మతల్లి అమ్మవారి చల్లదనం మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. జూన్ ఒకటి నుంచి పదో తేదీ వరకు గ్రామదేవత ఉత్సవాలు జరుపనున్న నేపథ్యంలో ముందుగా అమ్మవారిని ప్రతి ఇంటి నుంచి తీసుకొచ్చిన పసుపునీళ్లతో అభిషేకించి చల్లదనం చేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వేకువ జామున అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అభిషేకం చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అల్పాహారాన్ని ఉత్సవకమిటీ వారు ఏర్పాటు చేశారు. -కంచిలి

చింతామణి అమ్మవారికి పూజలు



కంచిలి మండలంలోని ఎక్కల పంచాయతీ పరిధి అర్జునాపురంలో చింతామణి అమ్మవారి సంబర మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నార. జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నర్తు రామారావు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు, స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ సతీమణి నీలోత్పల తదితరులు పాల్గొన్నారు. -కంచిలి

ధర్మానకు సత్కారం



మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు కవిటి మండలానికి మంగళవారం వచ్చారు. ఈ సందర్భంగా జెన్నాతోటలో (ఎన్ఆర్ ఫాంగార్డెన్స్) ఎమ్మెల్సీ నర్తు రామారావు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయన్ని మర్యాద పూర్వకంగా కలిశారు. దుశ్శాలువతో సత్కరించి ముందస్తుగా జన్మదిన శుభాకాంక్షలను తెలియజేశారు. కంచిలి, ఇచ్ఛాపురం ఎంపీపీలు పైల దేవదాస్‌రెడ్డి, బోర పుష్ప, వైఎస్సార్‌సీపీ నేతలు కడియాల ప్రకాష్, బెందాళం జయప్రకాష్, పి.ఎం.తిలక్, నర్తు నరేంద్ర, ఇప్పిలి కృష్ణారావు, తడక జోగారావు, కారంగి మోహనరావు, ఎన్ని అశోక్, రజనీకుమార్ దొళాయి, వై.నీలయ్య, నర్తు అశోక్ ఉన్నారు. కవిటి

సమ్మెను విజయవంతం చేయాలి



ర్యాలీ చేస్తున్న కార్మికులు



కాశీబుగ్గ: కాశీబుగ్గలో నిరసన తెలియజేస్తున్న సీఐటీయూ నాయకులు

మందస: లేబర్ కోడ్ రద్దు చేయాలని, పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలనే డిమాండ్‌తో జూలై తొమ్మిదో తేదీన నిర్వహించతలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కార్మికసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు సిద్దూరు ఆర్.కె.పురం జంక్షన్‌లో రైస్ మిల్లు కార్మికులు మంగళవారం ర్యాలీ చేశారు. సీఐటీయూ మండల కన్వీనర్ కె.కేశవరావు మాట్లాడుతూ.. కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రభుత్వాలు విడనాడాలని డిమాండ్ చేశాసారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు బాలకృష్ణ, బి.మల్లేష్, దుర్యోధన, కుర్మారావు, ఏకాశి, వెంకటేష్ పాల్గొన్నారు.

కాశీబుగ్గ: వివిధ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ జూలై తొమ్మిదో తేదీన చేపట్టనున్న సమ్మెను విజయవంతం చేయాలని ఏపీరైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెయ్యిల గణపతిరావు, ఏఐసీసీటీయూ జిల్లా నాయకులు కె.దుశ్యంత్‌లు కోరారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. దేశ పరిస్థితుల దృష్ట్యా విశాల దృక్పథంతో ఇటీవల నిర్వహించాల్సిన సమ్మెను వాయిదా వేశామన్నారు. డిమాండ్లు పరిష్కరించకపోతే జూలై తొమ్మిదో తేదీన దేశవ్యాప్త సమ్మె చేపడతామన్నారు. జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ టి.అజయ్‌కుమార్, కాష్యూ లేబర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శిష్టు గోపి, అంబటి ఆనంద్, ఏఐసీసీటీయూ నాయకులు కె.లోకనాథం, పి.నాగేశ్వరరావు, ఏపీ రైతు సంఘం నాయకులు కె.హేమసూదన్, కె.బాలాజీ, డి.కామేసు పాల్గొన్నారు.

అమ్మవారికి జెడ్పీ చైర్‌పర్సన్ పూజలు



ఉత్సవ కమిటీ సభ్యులతో జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

సోంపేట: పాలవలస గ్రామంలో నిర్వహిస్తున్న రౌతుపోలమ్మ గ్రామ దేవత ఉత్సవాల్లో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ మంగళవారం పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారి తిరువీధులో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

'మాటామంతి'కి రావివలస ఎంపిక

టెక్కలి: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈ నెల 22వ తేదీన వర్చువల్ ద్వారా నిర్వహిస్తున్న మాటామంతి కార్యక్రమానికి రావివలస ఎంపికైంది. ఈ విషయాన్ని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి మంగళవారం వెల్లడించారు. టెక్కలి భవానీ థియేటర్‌లో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రావివలసలోని ఎండల మల్లికార్జునస్వామి ఆలయాన్ని టెంపుల్ టూరిజంగా అభివృద్ధి చేయడానికి ఎంపిక చేసినట్లు ఆర్డీవో పేర్కొన్నారు.

జూన్ 6 నుంచి పెంటపోలమ్మ జాతర

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో జూన్ ఆరు నుంచి పదో తేదీ వరకు పెంటపోలమ్మ జాతర మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 12వవార్డు కౌన్సిలర్ పోతనపల్లి ఉమాకుమారి, నాయకులు హరిక్రిష్ణ ఆధ్వర్యంలో మంగళవారం ముర్రాట కార్యక్రమం నిర్వహించి అమ్మతల్లికి చల్లదనం చేపట్టారు. పల్లివీధి, హరిజన వీధి, పోలీసుస్టేషన్ వెనుక వీధి, చాకలి చెరువు వీధులకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



కొయడాన్స్‌తో అలరిస్తున్న యువకులు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని చినడోకులపాడులో గ్రామ దేవత ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గ్రామ యువకులు కొయడాన్స్ నృత్యాలతో అలరించారు. అలాగే అమ్మవారి నృత్యం, బిందెల డాన్స్‌లతో కళాకారులు సందడి చేశారు. భక్తులు ఘటాలలో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

నిరుపయోగంగా పడి ఉన్నాయ్..!

టెక్కలి: ప్రజా అవసరాల కోసం లక్షలాది రూపాయలతో కొనుగోలు చేసిన విలువైన యంత్రసామగ్రి నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. సక్రమంగా వినియోగించాల్సిన వీటిని అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎందకూ పరికిరాకుండా మూలకు చేరి మూలుగుతున్నాయి. టెక్కలి మేజర్ పంచాయతీ కార్యాలయంలో ట్రాక్టర్లు, ఇతర సాంకేతిక వాహనాలతో పాటు తహసీల్దార్ కార్యాలయంలో జనరేటర్ తదితర విలువైన వస్తువులను ఎక్కడపడితే అక్కడ పడేయంతో ఎండకు ఎండుతూ..వానకు తడుస్తూ పాడైపోతున్నాయి. లక్షలాది రూపాయల నిధులతో కొనుగోలు చేసిన వీటిని ఎందుకు నిరూపయోగంగా పడేశారో తెలియని పరిస్థితి. చిన్నచిన్న మరమ్మతులకు గురైన వాటిని బాగు చేయించి వినియోగంలోకి తీసుకురావాలనే ఆలోచన కూడా ఎవరూ చేయడం లేదు. ఒకవేళ ప్రజా అవసరాలకు వద్దనుకుంటే వేలం నిర్వహిస్తే కనీసం ప్రభుత్వానికి ఆదాయమైన సమకూరుతోందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



టెక్కలి పంచాయతీ కార్యాలయంలో నిరూపయోగంగా పడి ఉన్న చెత్తను తొలగించే సాంకేతిక వాహనం



టెక్కలి పంచాయతీ కార్యాలయంలో మూలకు చేరిన ట్రాక్టర్



పంచాయతీ కార్యాలయంలో నిరుపయోగంగా ఉన్న ట్రాక్టర్



తహసీల్దార్ కార్యాలయంలో మూలకు చేరిన జనరేటర్